సాక్షి సంగారెడ్డి
శనివారం : 17 : ఫిబ్రవరి : 2024



పత్తి ధర ధమాల్

పత్తి ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. రెండు నెలలు నుంచి పంటను నిల్వ చేశారు.

వివరాలు IIలో ▸



అమ్మతనం గుర్తించిన కన్న తల్లి

శ్మశానంలో మగబిడ్డ దొరికిన బిడ్డను సాకటానికి ఓ కన్న తల్లి ముందుకొచ్చింది.

వివరాలు IIలో ▸



ఆటోడ్రైవర్ల నిరసన

గుమ్మడిదల మండలంలోని కానుకుంట గ్రామంలో శుక్రవారం ఆటో డ్రైవర్‌లు నిరసన చేపట్టారు.

వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

జహీరాబాద్ ఆర్డీఓగా రాజు

జహీరాబాద్: ఆర్డీఓగా ఎస్.రాజును నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఆ స్థానంలో పనిచేసిన వెంకారెడ్డి వేరే చోటుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఈయన నియమితులయ్యారు.

ఏఎస్పీగా సంజీవరావు బాధ్యతల స్వీకరణ

సంగారెడ్డి : జిల్లా నూతన అదనపు ఎస్పీగా ఆరేటి సంజీవరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ చెన్నూరి రూపేష్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇప్పటి వరకు ఆయన ఇంటెలిజెన్స్ విభాగంలో సేవలందించారు.

డీఆర్‌ఓగా పద్మజా రాణి

సంగారెడ్డి టౌన్ : జిల్లా రెవెన్యూ అధికారిగా జీ పద్మజా రాణి నియమితులయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా డీఆర్‌ఓగా పనిచేసిన ఆమెను ఇక్కడికి నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఆ స్థానంలో ఉన్న నగేష్‌ను వనపర్తి అదనపు కలెక్టర్‌గా నియమించింది.

మహిళ అదృశ్యం

జిన్నారం(పటాన్‌చెరు): ఓ మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడలో జరిగింది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం... గ్రామానికి చెందిన వసంత బొంతపల్లిలో హోటల్ నడిపిస్తూ జీవనాన్ని సాగిస్తోంది. మూడు రోజుల నుంచి కనిపించకుండా పోయింది. దీంతో కుటుంబసభ్యులు తెలిసిన వారిని, బంధువుల వద్ద వెతికారు. ఫలితం లేకపోవటడంతో ఆమె తమ్ముడు గోవింద్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట దగా

రూ.41 లక్షలు పోగొట్టుకున్న వ్యాపారి

పటాన్‌చెరు టౌన్: నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో ఓ వ్యక్తి లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన పటాన్‌చెరు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని గౌతంనగర్ కాలనీకి చెందిన ఓ బ్యాటరీల వ్యాపారి జనవరి 6న ఒక సామాజిక మాధ్యమం చూస్తుండగా ఆన్‌లైన్ ట్రేడింగ్ కు సంబంధించిన లింక్ కనిపించింది. దాన్ని క్లిక్ చేసి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో అపరిచిత వ్యక్తి ఒక యాప్‌లో ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. వ్యాపారి దఫాలుగా రూ. 41 లక్షలు పెడుతూ వచ్చాడు. అవతల వ్యక్తి నగదు, కమీషన్ మొత్తంగా 94 లక్షలు చూపిస్తూ వచ్చాడు. బాధితుడికి ఏదో అవసరమై.. తిరిగి ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీలను సక్రమంగా నిర్వహించాలి

సంగారెడ్డి టౌన్: అంగన్‌వాడీలను సక్రమంగా నిర్వహించి లబ్ధిదారులకు పోషకాహార పదార్థాలు అందేలా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి అన్నారు. శుక్రవారం సూపర్ వైజర్స్, పోషణ్ అభియాన్ సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలని అన్నారు.

అండర్‌పాస్ కష్టాలు!



సంగారెడ్డి – అకోల జాతీయ రహదారిపై సింగూరు చౌరస్తా వద్ద వాహనం రోడ్డు దాటుతుంది. ఇక్కడ అండర్ పాస్ లేకపోవడంతో సింగూరు ప్రాజెక్టు వైపు నుంచి సంగారెడ్డి వైపు రాకపోకలు సాగించే వాహనాలు ఇలా ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని రోడ్డు దాటాల్సిన పరిస్థితి. ఇక్కడ అండర్ పాస్‌గానీ మరే ఇతర ప్రత్యామ్నాయ మార్గం చూపాల్సిన అవసరం ఉందని వాహనదారులు కోరుతున్నారు.

అల్లాదుర్గం మండలం చిల్వెర, అల్లాదుర్గం, కాయిదంపల్లి, రాంపూర్ గ్రామాలకు ఎగ్జిట్ రోడ్డు లేదు. దీంతో ఈ గ్రామాల వైపు వెళ్లాలన్నా.. ఈ గ్రామాల వాసులు నేషనల్ హైవేపై ప్రయాణించాలన్నా ఇలా ప్రమాదకరంగా రోడ్డు దాటాల్సి వస్తోంది. లేదంటే ఐదారు కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఎగ్జిట్ కావాల్సి వస్తోంది. ఈ సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల వాసులు కోరుతున్నారు.





కల్హేర్ మండలం దేవునిపల్లి రోడ్డు వద్ద అండర్ పాస్ లేకపోవడంతో ఈ గ్రామానికి చెందిన వాహనదారులు సంగారెడ్డి వైపు వెళ్లాలంటే ఇలా రాంగ్ రూట్‌లో వెళ్లాల్సి వస్తోంది. ఒక వేళ రైట్ రూట్‌లో పోవాలంటే మూడు కి.మీ.ల చుట్టూ తిరిగి మాసన్‌పల్లి గేట్ వద్ద నుంచి హైవే ఎక్కాల్సి వస్తోంది. నిజాంపేట్ మండలం ఖానాపూర్ (బీ) గ్రామం వైపు నుంచి వచ్చే వాహనాలు కూడా అండర్ పాస్ లేకపోవడంతో పిట్లం వైపు వెళ్లే వారిది ఇదే పరిస్థితి.

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : సంగారెడ్డి –అకోలా జాతీయ రహదారిపై వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అవసరం ఉన్న చోట్ల అండర్ పాస్‌లు లేవు. రహదారి నుంచి పలు గ్రామాల వైపు వెళ్లేందుకు ఉండాల్సిన చోట్ల ఎగ్జిట్‌లు లేవు. దీంతో ఆయా గ్రామాల వైపు వెళ్లే వారు ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. అలాగే అండర్ పాస్‌లు లేకపోవడంతో ఆయా చోట్ల రోడ్డు దాటడం ఇబ్బందిగా

- సంగారెడ్డి–అకోల నేషనల్ హైవే డిజైన్‌లో లోపాలు
- తరచూ రోడ్డు ప్రమాదాలు.. గాలిలో కలుస్తున్న ప్రాణాలు
- ఎగ్జిట్, ఎంట్రీలకు సౌకర్యం లేక చుట్టూ తిరగాల్సిన దుస్థితి..
- అస్తవ్యస్తంగా 161 జాతీయ రహదారి

మారుతోంది. ఈ రహదారిపై వాహనాలు వేగం ఎక్కువగా ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. విలువైన ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఈ రహదారి డిజైన్ లోపంతోనే ఇబ్బందులు తలెత్తుతున్నాయని, సంబంధిత అధికారులు ఈ సమస్యలకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

135 కి.మీలు.. రూ.3,503 కోట్లు..



సంగారెడ్డి - అకోలా జాతీయ రహదారి

సంగారెడ్డి సమీపంలోని కంది మండలం మామిడిపల్లి నుంచి అకోలా వరకు ఉన్న ఈ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మామిడిపల్లి నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు మొత్తం 135 కి.మీల పొడవున్న ఈ రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం మొత్తం రూ.3,503 కోట్లు వెచ్చించింది. ఐదేళ్ల పాటు ఈ పనులు కొనసాగి ఇటీవల పూర్తయ్యాయి. డిజైన్ లోపం కారణంగా పలు చోట్ల వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తరచూ ప్రమాదాలు.. గాలిలో కలుస్తున్న ప్రాణాలు..

ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకొని విలువైన ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. 2023లో మొత్తం 88 రోడ్డు ప్రమాదాలు జరిగితే 57 మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో



క్షతగాత్రులయ్యారు. అండర్‌పాస్‌లు లేక రోడ్డు దాటుతున్న క్రమంలో, ఎగ్జిట్, ఎంట్రీలకు సరైన సౌకర్యం లేక రాంగ్‌రూట్‌లో వస్తున్న క్రమంలో వాహనదారులు తరచూ ఈ ప్రమాదాల బారిన పడుతున్నారు.

“ నెల రోజులు ఉద్యమించాం



తాడ్‌దాన్‌పల్లి చౌరస్తా వద్ద అండర్ పాస్ లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. సింగూరు వైపు నుంచి సంగారెడ్డి వైపు వెళ్లాలంటే 2 లేక 3 కి.మీ దూరంలోని సుల్తాన్‌పూర్ వద్దకు వెళ్లి యు టర్న్ తీసుకోవాల్సి వస్తోంది. అండ్‌పాస్ ఏర్పాటు చేయాలని నెల రోజులపాటు ఉద్యమించాం. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

– రాకేష్, తాడ్‌దాన్‌పల్లి వాసి.

“ మంత్రికి వినతిపత్రం ఇచ్చాం



జాతీయ రహదారి నుంచి అల్లాదుర్గానికి వెళ్లేందుకు ఎగ్జిట్ రోడ్డు సౌకర్యం కల్పించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి, ఢిల్లీలోని సంబంధిత అధికారులకు విన్నవించాం. ఈ ఎగ్జిట్ రోడ్డుకు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రస్తుతం ఎగ్జిట్ రోడ్డు లేకపోవడంతో ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోంది.

– కాశీనాథ్, అల్లాదుర్గం గ్రామ వాసి

“ ఇబ్బందులు పడుతున్నాం



దేవునిపల్లి, ఖనాపూర్ గ్రామాల వద్ద అండర్ పాస్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. నేషనల్ హైవే ఎక్కాలంటే 3 కి.మీల దూరం చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. కొందరు వాహనదారులు తప్పనిసరి పరిస్థితుల్లో రాంగ్‌రూట్‌లో వెళుతున్నారు. అధికారులు ఇక్కడ అండర్‌పాస్ నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుంది.

– సంగమేశ్వర్, కల్హేర్ మండల వాసి

● కదంతొక్కిన కార్మికలోకం



సదాశివపేట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, సంఘాల నేతలు

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం సీఐటీయూ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ బంద్.. విజయవంతమైంది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం.. దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతోందని విమర్శించారు.

– సాక్షి, నెట్‌వర్క్

విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

అధికారులకు కలెక్టర్ క్రాంతి సూచన

సంగారెడ్డి టౌన్ : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 100 శాతం పోలింగ్ నమోదయ్యేలా అధికారులందరూ కృషి చేయాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని శుక్రవారం జిల్లా అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో త్వరలో పోలింగ్ జరగనుందన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఎదుర్కొన్న సమస్యలను అధిగమించాలని సూచించారు. ప్రతి సెంటర్లో వీల్ చైర్లు అందుబాటులో ఉండాలన్నారు. అవసరం మేరకు బ్రెయిలీ బ్యాలెట్ పేపర్స్ దగ్గర పెట్టుకోవాలన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా 9 చెక్ పోస్టులు నిర్వహిస్తున్నామన్నారు. అవసరాల రీత్యా మరిన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. సోషల్ మీడియాలో ఫార్వర్డ్ మెసేజ్ పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ఏవైన తప్పుడు సమాచారాలు గ్రూపుల్లో స్ప్రెడ్ అయినట్లయితే సంబంధిత అడ్మిన్లపై చట్ట రీత్యా కేసులు నమోదు చేస్తామన్నామని హెచ్చరించారు. జిల్లా ప్రజలందరూ ఎన్నికల ప్రవర్తన నియమావళికి కట్టుబడి ఉండాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, కామారెడ్డి అదనపు కలెక్టర్ మనుచౌదరి, అదనపు ఎస్పీ సంజీవరావు, అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్

అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం

జిల్లాలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై, నిబంధనలు పాటించని క్వారీలపై రెవెన్యూ, పోలీస్ శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ క్రాంతి అన్నారు. రోడ్డు సేఫ్టీకి సంబంధించి, పోలీసు శాఖ తరఫున్న అన్ని రకాల భద్రత పరమైన చర్యలు చేపడతామని ఎస్పీ రూపేష్ అన్నారు. ట్రాఫిక్ ను నియంత్రించడానికి పలు ఇప్పటికే కార్యక్రమాలు చేపట్టామన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. హెల్మెట్‌లు, సీటు బెల్టులు ధరించాలన్నారు.

విద్యతోనే మహిళా సాధికారత

జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి

పటాన్‌చెరు టౌన్: విద్య ద్వారానే మహిళా సాధికారత సాధ్యపడుతుందని కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి అభిప్రాయపడ్డారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మల్బార్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో మెరిట్ స్కాలర్ షిప్‌ను 232 మంది విద్యార్థినులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నగదు ఉపకార వేతనాలు భవిష్యత్ అవసరాల నిమిత్తం వాడుకోవాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, మల్బార్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి దీపక్ కుమార్ మాట్లాడుతూ, మహిళల ఆర్థికాభివృద్ధి వారి విద్యార్హతపైనే ఆధారపడుతుందన్నారు. తారా కాలేజ్ ప్రిన్సిపాల్ రత్న ప్రసాద్, రాధిక, పద్మజ, డాక్టర్ యోగి బాబు, సురేష్, శ్రీనివాసరావు, డాక్టర్ బగ్గ, రవీందర్, వీరేందర్, సరిత, విశ్వ భారతి, డాక్టర్ పూనమ్ కుమారి, అశ్వినీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు మెరిట్ స్కాలర్‌షిప్‌ను అందజేస్తున్న యాదగిరి

అగ్గి.. బతుకు బుగ్గి..!

పారిశ్రామికవాడలో కార్మికుల ప్రాణాలకు రక్షణేదీ?

పరిశ్రమల్లో విధులకు వెళ్లిన కార్మికులు క్షేమంగా ఇళ్లకు చేరడం కష్టంగా మారింది. పలు రసాయన పరిశ్రమల్లో కనీస రక్షణ చర్యలు లేవు. నైపుణ్యం, అవగాహన కలిగిన కార్మికులను తీసుకోకపోవడమే అధిక ప్రమాదాలకు కారణమని తెలుస్తోంది. ఇటీవల కాలంలో ఎక్కువ ప్రమాదాలు రియాక్టర్లు పేలడం వల్లే జరుగుతున్నాయి. వాటి ఒత్తిడిని సరైన సమయంలో గుర్తించకపోవడం, కెమికల్ రియాక్షన్‌ను నివారించడంలో విఫలం కావడంతో పేలుళ్లు జరుగుతున్నాయి.

- నిపుణుల పర్యవేక్షణ కరువు
- రసాయనాలపై అవగాహన లేమి
- పరిశ్రమల్లో కొరవడిన రక్షణ చర్యలు
- గతేడాది 18 పరిశ్రమల్లో ప్రమాదాలు
- 10 మంది మృతి.. 50 మందికి గాయాలు

పటాన్‌చెరు: ఇంటి నుంచి వెళ్లిన కార్మికుడు ఇంటికి క్షేమంగా వస్తాడో రాడోననే ఆందోళన కార్మికుల కుటుంబాల్లో నెలకొంది. రెండు రోజుల క్రితం పాశమైలారం పారిశ్రామికవాడలో రెండు రసాయన పరిశ్రమల్లో ప్రమాదం జరిగి మంటలు వ్యాపించాయి. ఒక కార్మికుడు సజీవ దహనమయ్యాడు. పటాన్‌చెరు నియోజకవర్గంలో పారిశ్రామిక వాడల్లో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం జరుగుతుందన డానికి ఈ ఘటన నిదర్శనం. ఇక పెద్ద ఎత్తున ప్రమాదాలు జరిగితేనే విషయాలు వెలుగులోకి వస్తాయి. లేకుంటే చీకట్లోనే ఉండిపోతాయి. కొందరు పారిశ్రామిక వేత్తలు వ్యాపారం అభివృద్ధి, లాభార్జన గురించి ఆలోచిస్తున్నారే తప్ప.. కార్మిక సంక్షేమం, శ్రేయస్సు గురించి అసలు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనలు కూడా పట్టించుకోవడం లేదు. కనీసం సహాయక చర్యలు తీసుకునేందుకు ఆయా పరిశ్రమ ఆవరణల్లో సరైన సౌకర్యాలు కల్పించడం లేదు. పాశమైలారం పారిశ్రామికవాడలో 297 పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో కొన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారు. అత్యవసర పరిస్థితుల్లో కనీసం ఫైరింజన్ తిరిగే పరిస్థితి కనిపించదు. బొల్లారం వంటి పారిశ్రామిక వాడలో ఎలాంటి నిబంధనలు లేకుండా నిర్మాణాలు చేశారు. ఒక పరిశ్రమలో ప్రమాదం జరిగితే తోటివి కూడా అగ్నికి ఆహుతయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

కార్మికుల వెట్టిచాకిరీ

జిన్నారం ఉమ్మడి మండల పరిధిలో 450 పరిశ్రమలు ఉన్నాయి. రికార్డుల ప్రకారం నియోజకవర్గ పరిధిలో గతేడాది పంతొమ్మిదింటిలో ప్రమాదాలు జరిగితే 50 మంది గాయపడి అందులో 10 మంది చనిపోయారు. గతేడాది నవంబర్‌లో పాశమైలారం పారిశ్రామికవాడలోని ఆదిత్య ఫార్మాలో పొడి రసాయనాన్ని ద్రవ రూపంలోకి మార్చే క్రమంలో మంటలు ఎగిసిపడ్డాయి. నిపుణులైన వారి పర్యవేక్షణ లోపం లేకపోవడం కార్మికులకు రసాయనాలపై సరైన అవగాహన లేమితో ప్రమాదం చోటుచేసుకుంది. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో కాంట్రాక్టు కార్మికులను పెట్టి వారితో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారు. బిహార్, ఒడిశా, జార్ఖండ్ తదితర ఉత్తరాది రాష్ట్రాల నుంచి కార్మికులను ముఠాలుగా తీసుకొచ్చి ఇక్కడ పని చేయిస్తున్నారు. ఏ పరిశ్రమలో ఎంత మంది పని చేస్తున్నారనే వివరాలు ఎవరి వద్ద ఉండటం లేదు. ప్రమాదంలో జరిగినప్పుడు ఇక్కడ ఎంత మంది పనిచేస్తున్నారు? ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించారా? లేదా? అనే వివరాలు సైతం చెప్పడం లేదు. రెండు రోజుల క్రితం సాల్ బేరీస్ పరిశ్రమలో ప్రమాదం జరిగితే మొత్తం 14 మంది అపస్మారక స్థితిలోకి వెళ్లారు. అందులో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఒకరు చనిపోయారు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు ఏమీ లేవని అధికారులు ప్రాథమికంగా తేల్చారు.



సీఎంహెచ్ పరిశ్రమ వద్ద రియాక్టర్ పేలిన ఘటనలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

“ కార్మికులకు అవగాహన కల్పించాలి



ప్రమాదాలు జరగకముందే కార్మికుల్లో పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రతి నెలా భద్రతా దినాన్ని పాటించి కార్మికులకు అవగాహన కల్పించాలి. ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేయాలి. దీనిపై ప్రభుత్వ అధికారి పర్యవేక్షణ ఉండాలి. నష్టపరిహారం అందాలి. చట్ట ప్రకారం అన్ని సౌకర్యాలు కల్పించాలి. పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారుల తనిఖీలు జరపడం లేదు అందుకే ప్రమాదాలు జరుగుతున్నాయి.

–ఎస్.యాదగిరి యాదవ్, భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి

కార్మికుల సంక్షేమం ఎవరికీ పట్టదు



జిల్లాలోని పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికులను పెట్టి పనులు చేయించుకుంటున్నారు. ఎలాంటి అర్హతలు లేకుండా భారీ యంత్రాలు, ప్రమాదకర రసాయనాలు ఉత్పత్తి కేంద్రాల్లో పని చేయించుకుంటున్నారు. రక్షక కవచాలు, మాస్కులు, కూడా అందించడం లేదు. ప్రమాదాల్లో గాయపడిన, మృతిచెందిన వారి వివరాలు వెల్లడించలేదు. నష్టపరిహారం అనే మాట రావడం లేదు.ఉత్తరాది రాష్ట్రాల నుంచి కనీసం చదవడం రాయడం రానివారితో వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. ఒక్క శాఖ అధికారి కూడా నిబంధనలను పాటించాలని సూచించడం లేదు తనిఖీలు చేయడం లేదు.

–నాయిని నర్సింహారెడ్డి, సీఐటీయూ జిల్లా నాయకుడు, పటాన్‌చెరు

సిబ్బంది లేరు

ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం నేనొక్కదాన్నే ఉన్నా.. సిబ్బంది లేరు. అయినా పారిశ్రామిక వాడల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు పాశమైలారం పారిశ్రామికవాడలోని పరిశ్రమలపై ఒక నివేదికను త్వరలోనే రూపొందించనున్నాం.

– శ్రీవిద్య, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


బోయిని వెన్నెల

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బోయిని వెన్నెల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, పీఈటీ తోట వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ జట్టులో స్థానం సాధించిన వెన్నెల సూర్యాపేట జిల్లాలోని మల్లారెడ్డి గూడెంలో నేటి నుంచి 19 వరకు జరిగే 33 వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెన్నెలను పాఠశాల టీచర్లు రవి శేఖర్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్, భూపాల్, దయాసాగర్ రెడ్డి, ప్రకాశ్, వినయ్, భాగ్యమ్మ, పద్మావతి, మేఘమాల, పెంటయ్య అభినందించారు.

వలంటీర్ల పాత్ర అభినందనీయం


మాట్లాడుతున్న రాష్ట్ర పర్యవేక్షకులు రోమిళ్ల

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా ఎస్‌ఎస్‌ఎస్ వలంటీర్లు విద్యార్థులకు బోధించడం అభినందనీయమని రాష్ట్ర స్థాయి పర్యవేక్షకులు అభిజిత్, రోమిళ్ల, జిల్లా కమ్యూనిటీ మొబిలైసింగ్ అధికారి రంగనాథస్వామి కొనియాడారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 13 వేల మంది ఎస్‌ఎస్‌ఎస్ వలంటీర్లు విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా బోధిస్తూ వారికి ఆట, పాటలతోపాటు చదువుల్లో రాణించేలా ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రమేశ్ బాబు, డాక్టర్ రాజు, రామచంద్రం, మార్కండేయ, శివ, జబ్బర్, కైలాష్, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పొలంలో జారి పడి వ్యక్తి మృతి


వరి పొలంలో రమేశ్ మృతదేహం

దౌల్తాబాద్(దుబ్బాక): వరి పొలంలో జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని శేరిపల్లి బందారంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్నోళ్ల రమేశ్ (43) ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు పడుతూనే కొంత కాలంగా మద్యానికి బానిసగా మారాడు. గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన రమేశ్ రాత్రి అయినా తిరిగి రాలేదు. శుక్రవారం తెల్లవారు జామున పొలాల వద్దకు వెళ్లిన రైతులు వరి పొలంలో పడి మృతి చెందిన రమేశ్‌ను గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మోటారు సైకిళ్లు దగ్ధం



కొండపాక(గజ్వేల్): టాటా ఏసీ వాహనంలో తీసుకెళ్తున్న దివ్యాంగుల ఎలక్ట్రికల్ మోటార్ సైకిళ్లు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. ఈ ఘటన కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ నుంచి మంచిర్యాల కలెక్టరేట్ కార్యాలయానికి శుక్రవారం టాటా ఏసీ వాహనంలో దివ్యాంగులకు పంపిణీ చేసే 10 ఎలక్ట్రికల్ మోటార్ సైకిళ్లను తీసుకెళ్తున్నారు. అందులోని ఓ వాహనం బ్యాటరీ పేలడంతో మంటలు చెలరేగి మిగితా వాటికి అంటుకున్నాయి. గమనించిన డ్రైవరు వెంటనే మోటార్ సైకిళ్లను కిందకు దింపడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అప్పటికే సుమారు ఆరు సైకిళ్లు పాక్షికంగా దగ్ధమయ్యాయి. ఈ విషయమై కుకునూరుపల్లి పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

పత్తి ధర ఢమాల్

- క్వింటాల్‌కు రూ.7,020 నుంచి రూ.6,600కు
- రోజురోజుకూ పడిపోతున్న ధర
- కొనుగోళ్లు తగ్గిస్తున్న సీసీఐ
- ఆందోళన చెందుతున్న రైతులు


మనూరు జిన్నింగ్ మిల్లులో నిల్వ ఉన్న పత్తి

మనూరు(నారాయణఖేడ్): పత్తి ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. రెండు నెలలు దాచిపెడితే మంచి ధర లభిస్తుందని భావించిన రైతన్నలకు నిరాశే ఎదురైతోంది. సీజన్ ప్రారంభంలో పత్తి ధరలు బాగానే ఉన్నా క్రమ క్రమంగా ధర పడిపోవడంతో రైతన్నల్లో ఆందోళన మొదలైంది. పత్తి ధర మొదట్లో సీసీఐ ద్వారా క్వింటాల్‌కు రూ. 7,020 ఉండగా ప్రస్తుతం రూ. 6,600 నుంచి రూ. 6,700 మధ్య కొనసాగుతోంది. రెండు నెలల కిందట ప్రారంభమైన సీసీఐ కొనుగోళ్లు ప్రస్తుతం పూర్తిగా తగ్గించడమే కాకుండా మరో రెండు రోజుల్లో కొనుగోళ్లు నిలిచిపోతున్నాయని మిల్లు నిర్వాహకులు చెబుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

10 క్వింటాళ్ల మేర దిగుబడి

నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో దాదాపుగా 80 వేల ఎకరాల్లో పత్తి సాగు అవ్వగా ఎకరాకు సగటున 8 నుంచి 10 క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చింది. ఇప్పటికే రైతులు పత్తిని రెండుమార్లు తీసి చేళ్ల నుంచి తీసుకొచ్చి ఇళ్లలో నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం 70 శాతం మేర రైతులు పత్తిని మార్కెట్‌కు తరలించారు. ధర పెరుగుతుందని ఆశతో ఉన్న మిగితా రైతుల్లో ఆందోళన మొదలైంది. మొదట్లో క్వింటాల్‌కు రూ. 7,020 ఉన్న పత్తి ధర ప్రస్తుతం రూ. 6,600 పడిపోయింది.

ప్రైవేట్ మార్కెట్‌లో లేని ధర

ప్రతీ ఏడాది పెద్ద రైతులు తాము పండించిన పత్తిని ఖేడ్ ప్రాంతం నుంచి గుజరాత్, మహారాష్ట్రలోని మద్నూర్ తదితర ప్రాంతాలకు తరలించేవారు. గతంలో సీసీఐ ధర కంటే ప్రైవేట్‌లో ఎక్కువ మద్దతు ధర వచ్చేది. కాగా ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల కారణంగా గుజరాత్ మార్కెట్‌నకు పత్తి వెళ్లకపోవడంతో ధర పెరగడం లేదని వ్యాపారస్తులు, దళారులు పేర్కొంటున్నారు. దీంతో ఈ ఏడాది ఆశించినంతగా రైతులకు లాభాలు రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఉన్నకాడికే స్థానిక మిల్లుల్లోనే విక్రయాలు కొనసాగుతున్నాయి.

సీసీఐ కేంద్రాలను కొనసాగించాలి

పత్తి జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాలను మరో నెల రోజులపాటు కొనసాగించాలని స్థానిక రైతులు అంటున్నారు. ఉన్న మార్కెట్ ధర ప్రకారమైనా తాము పత్తిని అమ్ముకుంటామని రైతులు పేర్కొంటున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు పేర్కొంటున్నారు.

మద్దతు ధర పెంచాలి



పత్తికి మద్దతు ధర పెరగాలే గాని రోజురోజుకూ తగ్గిస్తున్నారు. దీంతో తాము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సీసీఐ ద్వారా కొనుగోలు చేసే పత్తికి ధర అధికంగా ఉంటేనే ప్రైవేట్‌లో ధర ఎక్కువగా వస్తుంది. కానీ ఇప్పుడు ఉన్నకాడికి అమ్ముకోవాల్సి వస్తుంది.

– శివాజీ రావు, రైతు, మాయికోడ్

సీసీఐ కేంద్రాలు కొనసాగించాలి



సీసీఐ ద్వారా చేపడుతున్న కొనుగోళ్ల కేంద్రాలను కొనసాగించాలి. మరో నెల రోజుల వరకు కొనుగోలు తప్పనిసరిగా చేపట్టాలి. ఇప్పటికి వారంలో రెండు నుంచి మూడు రోజులు కొనడం ఆపడం వంటివి చేస్తున్నారు. దీంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నాం. అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– రాంశెట్టి, రైతు, నాగల్‌గిద్ద

ఇంకా నిర్ణయం రాలేదు

సీసీఐ ద్వారా కొనుగోలు చేసున్న పత్తి కేంద్రాలకు సంబంధించి కొనుగోలు నిలిపివేతపై తమకు ఇంకా ఎలాంటి సమాచారం లేదు. జిల్లాలోని రాయికోడ్, జోగిపేట, సదాశివపేట పరిధిలో సీసీఐ కొనుగోళ్లు పూర్తి అయినట్లు సమాచారం ఉంది. ఖేడ్ ప్రాంతంలో కొనుగోళ్లు ప్రస్తుతానికి కొనసాగుతున్నాయి. ఆగకుండా చూస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– వీర్‌శెట్టి, మార్కెట్ కమిటీ సెక్రెటరీ, ఖేడ్

స్వేచ్ఛగా చరిత్రను రచించాలి

- ఓయూ ప్రొఫెసర్ అర్జున్‌రావు
- చరిత్రపై తొలిసారి జాతీయ స్థాయి సదస్సు

సిద్దిపేటఎడ్యుకేషన్: ఆధునిక యుగంలో తాను సేకరించిన ఆధారాల ప్రాతిపదికగా స్వేచ్ఛగా చరిత్రను రచించే అవకాశం నేటి చరిత్రకారులకు ఉందని ఉస్మానియా యూనివర్సిటీ సామాజిక శాస్త్రం డీన్, చరిత్ర ఆచార్యులు కుతాడి అర్జున్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానామస్ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మన ఊరు–మన చరిత్ర జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాచీన యుగంలో చరిత్రకారులు ఆచార, సాంప్రదాయలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అలాగే, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్, సదస్సు కన్వీనర్, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్ మాట్లాడారు. తెలంగాణలో చరిత్రపై జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహించడం ఇదే ప్రథమమన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసం శ్రీనివాస్, పీజీ కో ఆర్డినేటర్ డాక్టర్ అయోధ్యరెడ్డి, పరీక్షల నిర్వహణ విభాగాధిపతి డాక్టర్ గోపాల సుదర్శనం, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ సుజాత, డాక్టర్ పల్లవి, డాక్టర్ భవానీ, ప్రముఖ తెలుగు అధ్యాపకులు, పరిశోధకులు సంఘనబట్ల నర్సయ్య, కళాశాల చరిత్ర అధ్యాపకులు డాక్టర్ కొండల్‌రెడ్డి, భిక్షపతి, గణేశ్, నాగేశ్వర్‌రావుతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ఆచార్యులు అర్జున్‌రావు

అద్దాలు పగులగొట్టి.. రూ.5 లక్షలతో ఉడాయించి

పార్కింగ్ చేసిన కారులో నగదు చోరీ


కాలనీలో విచారిస్తున్న పోలీసులు

చేగుంట(తూప్రాన్): కారు అద్దాలు పగులగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు రూ.5 లక్షలు చోరీ చేసిన ఘటన మండల కేంద్రమైన చేగుంట సీతారామ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం పెద్దచెప్యాల గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి బిల్డర్‌గా పని చేస్తున్నాడు. తనకు రావాల్సిన డబ్బుల కోసం చేగుంటకు వచ్చి యూనియన్ బ్యాంకులో నగదు డ్రా చేసి కారులో పెట్టుకున్నాడు. అనంతరం సీతారామ కాలనీలో తన మిత్రుడి ఇంటికి టీ తాగడానికి వచ్చాడు. బ్యాంకు వద్ద నుంచే కారును గమనిస్తున్న నలుగురు వ్యక్తులు బిల్డర్ వెంట వచ్చారు. విష్ణువర్ధన్‌రెడ్డి లోపలికి వెళ్లగానే రెండు బైకులపై వచ్చిన నలుగురు దొంగలు కొంత దూరంలో వాహనాలు ఆపారు. అందులో ఓ వ్యక్తి కారు అద్దాలు పగులగొట్టి రూ.5లక్షలు ఎత్తుకెళ్లాడు. గమనించిన స్థానికులతోపాటు బాధితుడు విష్ణువర్ధన్‌రెడ్డి బయటకొచ్చి పట్టుకునేందుకు ప్రయత్నించేలోపే పారిపోయారు. బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ వెంకటేశ్, స్థానిక ఎస్‌ఐ బాలరాజ్‌లతో కలిసి సీతారామ కాలనీలో విచారణ జరిపారు. కాలనీలోని ఇళ్లతోపాటు బ్యాంక్ ఆవరణలోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. దొంగలను పట్టుకునేందుకు చర్యలు ప్రారంభించామని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

గీ టీచరమ్మ మాకొద్దు

- అనుచితంగా ప్రవర్తిస్తోంది
- తోటి ఉపాధ్యాయుల ఆవేదన


మాట్లాడుతున్న హెచ్‌ఎం సవిత

మనోహరాబాద్(తూప్రాన్): ఉపాధ్యాయులు, విద్యార్థులతో అనుచితంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయురాలు వద్దని తోటి ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మనోహరాబాద్ మండలంలోని కూచారం ఉన్నత పాఠశాలలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, హెచ్‌ఎం సవిత, పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడారు. తమ పాఠశాలలో ఎస్టీటీగా పని చేస్తున్న ఉపాధ్యాయురాలు అమరవాణి అనుచితంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రశ్నిస్తే చెప్పలేని విధంగా నానా బూతులు మాట్లాడుతుందని ఆరోపించారు. విద్యార్థులతో అనుచితంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ విషయమై డీఈఓకు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. హెచ్‌ఎంతో సైతం ఇదే విధంగా ప్రవర్తిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు రాఘవేందర్, నాయకులు నాగిరెడ్డి, పీఆర్టీయూ అధ్యక్షులు పద్మిని, టీపీటీఎఫ్ అధ్యక్షుడు నర్సింగం, ఉపాధ్యాయులు మురళీమనోహర్, మంజుల, బాలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సాయిబాబ, లలిత, అరుణజ్యోతి, ప్రశాంత్, శ్రీలత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హైనా దాడిలో దూడ మృతి

మద్దూరు(హుస్నాబాద్): హైనా దాడిలో లేగ దూడ మృతి చెందిన ఘటన మండలంలోని రెడ్యానాయక్ తండాలో శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోహన్ అనే రైతు గురువారం రాత్రి ఎప్పటి మాదిరిగానే కొట్టంలో పశువులను కట్టేసి ఇంటికొచ్చాడు. తెల్లవారు జామున పశువుల కొట్టం వద్దకు వెళ్లి చూడగా లేగ దూడ తీవ్ర గాయాలతో చనిపోయి ఉండడాన్ని గమనించాడు. హైనా దాడిలోనే లేగ దూడ మృతి చెంది ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

తల్లీ, కూతురు అదృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తల్లి, కూతురు అదృశ్యమైన ఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. కొల్లూర్ పోలీసుల కథనం ప్రకారం... వెస్ట్ బెంగాల్ కు చెందిన జయంత్ బిశ్వాస్ భార్య కవితా బిశ్వాస్, నాలుగేళ్ల కూతురు అంకితతో కలిసి ఆరు నెల కిందట తెల్లాపూర్‌కు వలస వచ్చాడు. మున్సిపాలిటీ పరిధిలోని ఓ లేబర్ క్యాంప్‌లో నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. జయంత్ బిశ్వాస్ నిత్యం మద్యం సేవించి భార్యను కొట్టేవాడు. భర్త వేధింపులు తాళలేక కవిత కూతురుతో కలిసి ఈనెల 14వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతికినా లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

తూప్రాన్: ఆర్థిక ఇబ్బందులు, మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నర్సంపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం నర్సంపల్లి గ్రామానికి చెందిన బుక్యా గణేశ్(33) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. మద్యానికి బానిసై గురువారం రాత్రి ఇంటి ఎదుట రేకుల షెడ్డులో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు.

పరిశ్రమలను ఏర్పాటు చేయాలి

- వలసలను నివారించాలని అసెంబ్లీలో ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రస్తావన


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: పరిశ్రమల వికేంద్రీకరణలో భాగంగా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న ఖేడ్ నియోజకవర్గంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి వలసలను నివారించాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన అసెంబ్లీలో జీరో అవర్‌లో భాగంగా మాట్లాడుతూ ఉపాధి కరువై కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు ఖేడ్ వాసులు వలసలు వెళుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి జరిగితే బీఆర్‌ఎస్ ప్రభుత్వం దాన్ని విస్మరించిందన్నారు. వైఎస్‌ఆర్, కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంలుగా ఉన్నప్పుడు చాలా రంగాల్లో ఈ ప్రాంతం అభివృద్ధి సాధించిందన్నారు. నల్లవాగు వరద కాలువ, నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతలు పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని కోరారు. పీజీ కళాశాలు, మహిళా పాలిటెక్నిక్, ఐటీఐ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. డీఎస్సీ ద్వారా ఈ ప్రాంతంలో ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రాంతీయ ఆస్పత్రిలో పడకలు పెంచి, పీహెచ్‌సీల్లో ఉన్న ఖాళీలను, ఇంజినీరింగ్ శాఖల్లోనూ పోస్టులను భర్తీ చేయాలన్నారు. తడ్కల్‌ను మండలంగా చేయాలని మెదక్ జిల్లాలో ఉన్న పెద్దశంకరంపేటను సంగారెడ్డి జిల్లాలో కలపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి కోమటిరెడ్డి.. సంజీవరెడ్డి ప్రశ్నలను నోట్ చేసుకున్నామన్నారు. ప్రభుత్వం త్వరగా సమస్యలను పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. పరిశ్రమల ఏర్పాటుపై కూడా సానుకూలంగా స్పందించారు.

వ్యక్తిగత కక్షతోనే ఆపరేటర్ హత్య

- నిందితుల రిమాండ్
- వివరాలు వెల్లడించిన సీఐ కేశవులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కేశవులు

కౌల్దారం(నర్సాపూర్): వ్యక్తిగత కక్షతోనే విద్యుత్ ఆపరేటర్‌ను హతమార్చారని.. హత్యకు కారకులైన ముగ్గురు నిందితులను గుర్తించి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు మెదక్ రూరల్ సీఐ కేశవులు తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కౌల్దారం మండలం పోతిరెడ్డిపల్లి విద్యుత్ ఉపకేంద్రంలో విద్యుత్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కట్కూరి నరేష్ (35) ఈనెల 13న దారుణ హత్యకు గురైన సంఘటన తెలిసిందే. హత్య కేసులో నిందితుడిగా ఉన్న వెల్దుర్తి మండలం ఉప్పులింగపూర్‌కు చెందిన లింగారి పాల్‌కు మృతుడు నరేష్‌కు మధ్య ఇంటి వద్ద బైక్ విషయమై గొడవ జరిగినట్లు తెలిపారు. అలాగే తరచూ పాల్ ఇంటికి వచ్చి తన భార్యకు అసభ్యకరంగా సైగలు చేసేవాడని కక్ష పెంచుకున్నట్లు చెప్పారు. ఈక్రమంలో నరేష్‌ను ఎలాగైనా అంతమొందించాలని అదే గ్రామానికి చెందిన తన స్నేహితులైన మర్కంటి స్వామి, అంధనగరానికి చెందిన ప్రశాంత్‌కు మద్యం తాగించి పథకం వేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 13న నరేష్ డ్యూటీకి వెళ్లాడన్న సంగతి తెలుసుకున్న ముగ్గురు మద్యం సీసాలు తీసుకొని స్కూటీపై కొంగోడ్ శివారులోని నరేష్ పని చేస్తున్న విద్యుత్ ఉప కేంద్రానికి కొద్ది దూరంలో ఉన్న పంట పొలంలో మద్యం సేవించినట్లు తెలిపారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో విద్యుత్ ఉపకేంద్రం పరిసరాల్లో ఎవరూ లేరని నిర్ధారించుకున్న ముగ్గురు విద్యుత్ కేంద్రానికి కొద్ది దూరంలో స్కూటీని నిలిపివేసి వెంట తెచ్చిన ఇనుప రాడ్డు, తాడును పట్టుకొని నరేష్ ఉన్న గది వద్దకు వెళ్లారన్నారు. ఎవరని ప్రశ్నించే క్రమంలోనే ప్రశాంత్ రూంలోకి వెళ్లి వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్‌తో నరేష్ తలపై గట్టిగా కొట్టాడన్నారు. దీంతో కింద పడగా వెంటతెచ్చిన తాడును ముగ్గురు మెడకు చుట్టారని తెలిపారు. పాలు ప్రశాంత్ దగ్గర నుంచి ఇనుపరాడు తీసుకొని నాలుగైదు సార్లు తలపై బలంగా కొట్టగా బలమైన గాయాలతో చనిపోయినట్లు తెలిపారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అమ్మతనం గుర్తించిన కన్న తల్లి

- శ్మశానంలో బిడ్డను వదిలిన వైనం
- అధికారుల కౌన్సెలింగ్‌తో తల్లి చెంతకు బాలుడు
- సాక లేక వదిలేశానన్న బాధితురాలు


తల్లికి కౌన్సిలింగ్ ఇస్తున్న అధికారులు

పుల్‌కల్(అందోల్): అమ్మతనం గుర్తించిన కన్న తల్లి శ్మశానంలో వదిలిపెట్టిన మగబిడ్డను సాకటానికి పొత్తిళ్లలోకి తీసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని ముదిమాణిక్యం గ్రామంలో బుధవారం ఓ మహిళ శ్మశానవాటికలో అప్పుడే పుట్టిన మగ బిడ్డను వదిలిపెట్టిన విషయం తెలిసిందే. ఈ దారుణానికి ఒడిగట్టిన మహిళ అదే గ్రామానికి చెందిన బోయిని ఎల్లమ్మగా శిశు సంక్షేమ అధికారులు గ్రామస్తుల సాయంతో గుర్తించారు. వెంటనే ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి బిడ్డను పోషించుకునేలా ఒప్పించి ఈ మేరకు ఒప్పందపత్రం రాయించుకున్నారు. భర్త లేకపోవడం ఇప్పటికే ఓ ఆడ కూతురు ఉండడంతో మగబిడ్డను పోషించలేక వదిలించుకోవాలనుకున్న అని తెలిపింది. జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి లలిత కుమారి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రత్నం కృషితో ఆ తల్లి బిడ్డను పోషించుకుంటా అని ఒప్పుకోవడంతో ఆమెకు అప్పగించారు.

సత్వర న్యాయానికి కృషి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకరరావు


మాట్లాడుతున్న ప్రభాకరరావు

సంగారెడ్డి టౌన్: కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకరరావు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా కోర్టులో మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న సందర్భంగా పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రిమినల్ కాంపౌండ్, ఎక్సైజ్, డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఎక్కువగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు, అడిషనల్ ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ సత్తయ్య, న్యాయవాదులు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూల్ స్థలం ధారాదత్తం

- హెచ్‌ఎంకు తెలియకుండా పంచాయతీ కార్యదర్శి నిర్వాకం
- ఇంటి నంబర్ కేటాయించి మరీ బదలాయింపు
- 566 గజాలు గిఫ్ట్ డీడ్ చేసిన వైనం

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వ పాఠశాల స్థలం కబ్జాకు గురికాకుండా ప్రభుత్వం ఓ వైపు కోట్ల రూపాయల నిధులు వెచ్చించి ప్రహరీలు నిర్మిస్తుంటే మండల కేంద్రమైన వెల్దుర్తిలో పంచాయతీ కార్యదర్శి ఇందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరించింది. విద్యార్థులు ఆడుకునే క్రీడా స్థలానికి ఏకంగా ఇంటి నంబర్ కేటాయించి ఓ భవన నిర్మాణానికి దారాదత్తం చేశారు. హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ కమిటీకి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే సంబంధిత కార్యాలయ సెక్రటరీ పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. యాజమాన్య ధ్రువపత్రం సైతం అందజేశారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లోనే హద్దులు తప్పుల తడకగా ఉండడం, సాక్షులుగా పంచాయతీ సిబ్బంది మాత్రమే ఉండడంతో స్థలం బదలాయింపులో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి.

ఇంటి నంబర్ కేటాయించి..

వెల్దుర్తి ఉన్నత పాఠశాల ఆట స్థలంలో గ్రంథాలయ భవన నిర్మాణం కోసం సుమారు వెయ్యి గజాలు కేటాయించాలని గ్రామ పంచాయతీ మే 2019లో తీర్మాణం చేసింది. ఈ కాపీని పాఠశాల హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ కమిటీ, మండల విద్యాధికారి కార్యాలయంలో అందించ లేదు. ఇంతలోనే అప్పటి పంచాయతీ కార్యదర్శి పద్మ 5,100 చదరపు అడుగుల పాఠశాల ఆట స్థలానికి ఇంటి నంబర్ కేటాయించి యాజమాన్య ధ్రువపత్రం తయారు చేసింది. అనంతరం ఇరవై రోజులకు పాఠశాల స్థలంలో 566.66 గజాలు జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ పేరిట గిఫ్ట్ డీడ్ చేశారు. ఈ స్థలం గ్రంథాలయ నిర్వాహకులది అనడంతో పాఠశాల యాజమాన్యం కంగుతిన్నారు. ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకొని ఆట స్థలం అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని వారు కోరుతున్నారు.



వెల్దుర్తి ఉన్నత పాఠశాల

ఎలాంటి సమాచారం లేదు..

పాఠశాల ఆట స్థలం గ్రంథాలయ భవన నిర్మాణానికి కేటాయించడానికి పంచాయతీలో చేసిన తీర్మాణం విషయం కూడా మాకు తెలియదు. ఎస్‌ఎంసీ కమిటీలో ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే నిబంధలనకు పూర్తి విరుద్ధంగా పంచాయతీ కార్యదర్శి వేరే శాఖకు గిఫ్ట్ డీడ్ చేశారు. ఈ విషయంలో రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

–సాంబయ్య, హెచ్‌ఎం